క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత

దొరవారిసత్రం: గుండెపోటుతో మరణించిన వ్యక్తి కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా నగదును సచివాలయ సిబ్బంది అందజేశారు. ఏకొల్లు పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన పునబాక ప్రవీణ్‌కుమార్ గత వారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు కుటుంబానికి సోమవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి రామయ్య, సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలు అందజేశారు.

మెరుగైన సేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కలిచేడు, తురిమెర్ల సచివాలయాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. అనంతరం తురిమెర్ల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ దయాకర్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నేతలు

సైదాపురం: పాలూరు, అనంతమడుగు గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు తహసీల్దార్ విజయలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారంలో కిందిస్థాయి సిబ్బంది స్పందించకపోవడంతో అవి జటిలమవుతున్నాయని చెప్పారు. సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు నలమారు రామ్‌గోపాల్‌రెడ్డి, సైదాపురం సొసైటీ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరాజు, నేత చెమిర్తి శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

కాలువలు మరమ్మతు చేస్తాం

కోట: మండలంలో పూడిపోయిన స్వర్ణముఖి పంట కాలువలు మరమ్మతు చేస్తామని ఎంపీడీఓ భవానీ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భవానీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కోటలో ఆక్రమణల తొలగింపు పూర్తి చేసి, రోడ్డు వెడల్పు చేస్తామన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించామన్నారు. ఆర్టీసీ ప్రాంగణంలో అపరిశుభ్రత కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశంలో చెప్పారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జున్, వైస్ ఎంపీపీ శేషయ్య పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



పల్లకిలో ఊరేగుతున్న హనుమంతుడు

చిట్టమూరు: హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఆరూరులో హనుమంతుడికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేసి, బాణసంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డీఆర్వో కోటేశ్వరరావు

దక్కిలి: పర్యావరణాన్ని పరిరక్షణ మన అందరి బాధ్యత అని డక్కిలి సెక్షన్ డీఆర్వో ఎన్వీ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం గ్రామస్తులు, భక్తులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం ఆవరణలో వ్యాపారులు ప్లాస్టిక్ విక్రయించకుండా నిషేధించాలన్నారు. కోనేరు, ఆలయం చుట్టుపక్కల ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు రామకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 33.923 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 33.923 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2 వేల క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లో లెవల్ స్లూయిస్‌కు 180, హైలెవల్ స్లూయిస్‌కు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

‘పల్లె’వించిన అభివృద్ధి



నిర్మాణంలో ఉన్న సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు



చవట ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ

అది మారుమూల పంచాయతీ. నిన్నటి వరకు ప్రగతి కిరణాలు సోకని పల్లె. అక్కడ ఇప్పుడిప్పుడే అభివృద్ధి పవనాలు వీస్తున్నాయి. మౌలిక వసతుల కల్పన.. రోడ్ల నిర్మాణం.. ఇంటింటికీ కొళాయితో తాగునీటి వసతి కలిగింది. ఫలితంగా ఆ పంచాయతీ రూపురేఖలు మారాయి. ఇదీ ఓజిలి మండలంలోని ఇనుగుంట అభివృద్ధి ప్రస్థానం.

- రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు
- తాగునీరు, డ్రైనేజీ సమస్య పరిష్కారం
- సీసీ రోడ్ల నిర్మాణం
- రూపురేఖలు మారిన ఇనుగుంట

ఓజిలి: మండలంలోని ఇనుగుంట పంచాయతీలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. సుమారు రూ.2.50 కోట్లతో పలు పనులు సాగుతున్నాయి. మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఇనుగుంట పంచాయతీ ఉంది. పంచాయతీలో పాళెంపాడు, కొత్తపాళెంపాడు, చవట ఎస్సీకాలనీ, వజ్జావారిపాళెం, ఇనుగుంట హ్యాబిటేషన్ గ్రామాలున్నాయి. గతంలో పాలకులు అభివృద్ధిని గురించి పట్టించుకోలేదు. నేడు ప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు కావడంతో పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

తీరనున్న తాగునీటి సమస్య

పంచాయతీలో తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సహాయంతో సర్పంచ్ కొణిదల విజయమ్మ చర్యలు చేపట్టారు. చవట ఎస్సీ కాలనీ వద్ద రూ.3.40 లక్షలతో తాగునీటి బోరు తవ్వించి, పైపులైను ఏర్పాటు చేశారు. ఇనుగుంట గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా రూ.20 లక్షలతో వాటర్‌ప్లాంట్, 5 బోర్లు, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వజ్జావారిపాళెంలో మరో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కానుంది.

దుర్వాసనకు స్వస్తి

పంచాయతీలోని గ్రామాల్లో రూ.కోటి నిధులతో మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో మురుగునీరు ఈ కాలువల్లో వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కాలువల నుంచి దుర్వాసన వెదజల్లకుండా ఉండేందుకు వాటిపై మూత వేశారు. ఎస్సీకాలనీలో రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించారు.

రూ.90 లక్షలతో భవనాలు

ప్రజల ముగింటకే పాలన తీసుకురావాన్న దృఢసంకల్పంతో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో శాశ్వత ప్రభుత్వ భవనాలను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో రూ.90 లక్షలతో సచివాలయం, వెల్‌నెస్, రైతుభరోసా, బల్క్‌మిల్క్‌సెంటర్ భవనాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులు పూర్తి కావస్తుండటంతో ఇనుగంట గ్రామం రూపురేఖలు మారుతున్నాయి.

తాగునీటి సమస్య పరిష్కారం



పంచాయతీలో తాగునీటికి ఇబ్బంది లేకుండా జలజీవన్ మిషన్ పథకం ద్వారా కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారం అయ్యింది. ఇక నీటికి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు.

\- పాలూరు వేణురెడ్డి వజ్జావారిపాళెం

వేగంగా పనులు



వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రం, అదనపు సచివాలయ భవనం, వెల్‌నెస్ సెంటర్, పాఠశాల ప్రహరీ నిర్మాణం వంటి పనులు చేపట్టాం. పక్కా భవనాలు పూర్తి అయితే గ్రామంలో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయి.

\- రామాబత్తిన సురేష్, వైఎస్సార్‌సీపీ నేత ఇనుగుంట

రూ.2.50 కోట్లతో పనులు



పంచాయతీలో రూ.2.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు వాటర్‌ప్లాంట్లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టాం. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను రూ.కోటితో నిర్మిస్తున్నాం.

\-కొణిదల విజయమ్మ సర్పంచ్, ఇనుగుంట

నవరత్న పథకాలే శ్రీరామరక్ష



లింగారెడ్డిపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి అమలు చేసిన నవరత్నాల పథకాలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో గెలుపునకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని ఇనుగుంట, రవిపాడు, లింగారెడ్డిపల్లెలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, నాయకులకు స్థానిక నాయకులు శాలువలు కప్పి సన్మానించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుని కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పరిపాలనను గ్రామాల్లో అందుబాటులోకి తీసుకొచ్చి పేదల కష్టాలను తీర్చారన్నారు. రాష్ట్రంలో చుక్కల భూముల సమస్యను పరిష్కరించి, రైతులకు పెన్నిధిగా మారారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎం.సుధీర్ కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు, సర్పంచ్ కే విజయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్ సంధ్యారాణి, ఏఎంసీ డైరెక్టర్ సీ దీప్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఈ రాజారామిరెడ్డి, నాయకులు జీ వెంకటరెడ్డి, పీ వేణురెడ్డి, పీ కుమార్‌నాయుడు, కే సుబ్బారెడ్డి, ఆర్ సురేష్, నాగభూషణ్‌రెడ్డి, ముమ్మయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చవట ఎస్సీ కాలనీలో...

ఇనుగుంట పంచాయతీ పరిధిలోని చవట ఎస్సీకాలనీ, కొత్త, పాత పాళెంపాడు, రావిపాడు పంచాయతీ పరిధిలోని బండారుగుంట గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

తిరుమలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపతి నరేంద్రను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. నరేంద్ర కొంత కాలంగా అనారోగ్య సమస్యతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆయన్ని పరామర్శించి, ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు.

సున్తీ ఇస్లాం సంప్రదాయం



మాట్లాడుతున్న షేక్ రియాజ్ అహ్మద్

గూడూరు: సున్తీ(ఒడుగులు) ఇస్లాం సంప్రదాయమని, ప్రతి ముస్లిం బాలుడు తప్పనిసరిగా ఒడుగులు చేయించుకోవాలని మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. షాదీ మంజిల్‌లో సోమవారం డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన 150 మంది ముస్లిం పిల్లలకు ఒడుగులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మందులు, పౌష్టికాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. నెల్లూరు మసీదు ఇమామ్ మౌలానా అలీ మాట్లాడుతూ నెట్‌వర్క్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహీం, అన్వర్‌బాషా, అజీజ్‌ఖాన్, యూసఫ్ హుస్సేన్, కాలేషా, ఖాదర్‌బాషా, నజీర్, డాక్టర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నెల్‌క్యాస్ట్ పరిశ్రమ ప్రతినిధులు

గూడూరు: పట్టణంలోని మోక్షధామం ప్రహరీ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ పరిశ్రమ ప్రతినిధులు ఎన్ఎస్‌రెడ్డి, రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మోక్షధామం ప్రహరీ నిర్మాణం, మొక్కలు నాటేందుకు నెల్‌క్యాస్ట్ పరిశ్రమ వారు రూ.3.5 లక్షల నిధులు అందజేసినట్లు తెలిపారు. మోక్షధామానికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, రోటరీ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు తమ పరిశ్రమ ద్వారా రూ.3.5 లక్షలతో పనులు చేసేందుకు ముందుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్‌లు దశరథరామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మునిగిరీష్, రఘురామిరెడ్డి, రత్నం, జీజీ నాయుడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి సహకరించండి



ముత్యాలరాజుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పట్టణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కోరారు. తాడేపల్లిలోని సెక్రటేరియట్‌లో సోమవారం ఆయన చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి, సీఎంఓ సెక్రటరీ ముత్యాలరాజు తదితరులను కలిశారు. ఫ్లైఓవర్ పనులు ఆగిపోవడంతో గూడూరు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

చిల్లకూరు: మండలంలో సాగరమాల రహదారికి సంబంధించిన భూ సేకరణను వేగవంతం చేయాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన భూ సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ప్రాంతాల్లో రైతులు ఇంకా భూమిని అప్పగించేందుకు ముందుకు రావడం లేదని, దీనికి కారణం వారి వద్ద సరైన పత్రాలు ఉన్నాయా? లేదా అన్న విషయాలపై ఆరా తీసి, రికార్డులను పరిశీలించాలని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిలో సాగు చేస్తున్న వారు తమకు కూడా పరిహారం ఇవ్వాలని కోరుతున్నారని, దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వీఆర్వోలు మరోసారి ఆయా ప్రాంతాల్లో రైతులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించి భూ సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. ఆర్ఐ రమ్యస్వాతి పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం జగన్

సైదాపురం: ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడిగా నిలిచారని రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్మన్ పోట్టేళ్ల శిరీషాయాదవ్ అన్నారు. మండలంలోని తురిమెర్లలో సోమవారం ఆమె విలేకరుల మాట్లాడారు. తరతరాలుగా చుక్కల భూములను సాగు చేసుకుంటున్న రైతులు వాటిపై హక్కులు లేక అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతునారన్నారు. ఈ సమస్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపుతూ రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించారన్నారు.

బీమా పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏపీఓ గిరిబాబ

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే బీమా పథకాలపై సోమవారం ఏపీఓ గిరి బాబు అవగాహన కల్పించారు. మండలంలోని ముత్యాలపాడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులకు వచ్చిన కూలీలతో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల వరకు ప్రమా బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకానికి 18- 70 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. అంగవైకల్యం సంభవించినా బీమా వర్తిస్తుందన్నారు. అలాగే ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల వరకు జీవిత బీమా వర్తిస్తుందన్నారు. 18–50 ఏళ్ల లోపు వారు ఈ పథకానికి అర్హులని చెప్పారు.

కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి

వెంకటగిరి: పట్టణంలో శాశ్వత కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ఏపీ వీధివ్యాపారుల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్ తెలిపారు. రెవెన్యూ కార్యాలయం వద్ద వీధి వ్యాపారులతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వీధి వ్యాపారుల రక్షణ, క్రమబద్ధీకరణ చట్టం 2014 ప్రకారం మున్సిపల్ అధికారులు వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటైన కూరగాయల మార్కెట్ నేటికీ అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జాన్, మునీంద్ర, శ్రీనివాసులు, విజయ్, రాధాకృష్ణారెడ్డి, అరుణ, రఫీ, శివయ్య, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం



అర్జీ స్వీకరిస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని 14వ వార్డు కౌన్సిలర్ ఏ శంకరయ్య తెలిపారు. వార్డు సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే స్పందన అర్జీలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

వెంకటగిరిరూరల్: స్థానిక ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ శంషాద్‌బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బొప్పాపురం-3, డక్కిలి మండలం చీకిరేణిపల్లెలో అంగన్‌వాడీ వర్కర్, వెంకటగిరి రూరల్ మండలం ముద్దంపల్లె, డీసీపీ కండ్రిగ, పాలగొండ సత్రం, పట్టణంలోని మసీదు వీధి, బాలాయపల్లి మండలంలోని పాకపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

19 గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి పంచాయతీలోని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేసవిలో నీడ, నీరు వసతుల కల్పన



కూలీలతో మాట్లాడుతున్న పీడీ

సైదాపురం: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు వేసవి కాలంలో పనిచేసే చోట నీరు, నీడ తదితర వసతులు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ వెంకట్రావ్ వెల్లడించారు. మండలంలోని పరసారెడ్డిపల్లెలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో పూడికతీత పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ పని ద్వారా సుమారు 3,512 పని దినాలను కూడా కల్పించినట్లు చెప్పారు. ఉపాధి పనులకు వచ్చే ప్రతి కూలీకి రోజు రూ.272 గిట్టుబాటు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా పని జరిగే ప్రాంతాల్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఎక్కువ పని జరిగేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఆయన వెంట ఏపీఓ మురళి తదితరులున్నారు.

మహోన్నతులు.. పుచ్చలపల్లి

గూడూరు: సంపన్నుల కుటుంబంలో జన్మించి, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయులు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకులు కొనియాడారు. ఈ నెల 19వ తేదీన ఆయన వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం చెన్నూరు కమిటీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించనున్నారు. ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎస్‌కే షరీనాకు సోమవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీ రమణయ్య, జోగి శివకుమార్, శ్రీనివాసులు, బీవీ రమణయ్య, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

సముద్ర జీవులను కాపాడుదాం



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

వాకాడు: మానవుని మనుగడకు దోహదపడే సముద్ర జీవులను కాపాడుకోవాలని, ఇది అందరి బాధ్యత అని వన్యప్రాణి విభాగం సూళ్లూరుపేట ఎఫ్ఆర్ఓ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన వాకాడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సముద్రంలో ఎలాంటి చెత్తా చెదారం, ప్లాస్టిక్ పరికరాలు వేయకూడదని, అలాగే సముద్రంలో ఉండే జీవులకు హాని కలిగించే కార్యకలాపాలకు పాల్పడకూడదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీనాథ్, డిప్యూటీ రేంజర్ భాగ్యమ్మ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సురేష్, పాల్గొన్నారు.

శివాలయ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

వెంకటగిరి: వైఎస్సార్ జగనన్నకాలనీ సమీపంలోని శివాలయం స్థలం ఆక్రమిస్తున్నారని స్థానిక మల్లమ్మగుడి వీధి సచివాలయ అడ్మిన్‌కు మనులాలపేటకు చెందిన ఉపాధ్యాయుడు అప్పిన వెంకటేశ్వర్లు సోమవారం ఫిర్యాదు చేశారు. వార్డు సచివాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ స్థల ఆక్రమణపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫోన్ చేస్తే తొలుత సచివాలయంలో ఫిర్యాదు చేయమన్నారని, అక్కడ పరిష్కారం కాకపోతే మళ్లీ సంప్రదిస్తే న్యాయం చేస్తామని తనకు కాల్‌సెంటర్ నుంచి సమాధానం వచ్చిందన్నారు. అడ్మిన్ ఈ మునీంద్ర మాట్లాడుతూ ఈ విషయంపై విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెళ్లకూరు: మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. జీలపాటూరు గ్రామానికి చెందిన సింగమాల కృష్ణయ్య పెళ్లకూరులోని బంక్‌లో పెట్రోల్ తీసుకొని రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు ప్రమాదవశాత్తు ఢీ కొంది. ఈ ఘటనలో కృష్ణయ్యకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు పరారవుతుండగా అక్కడే ఉన్న ఓ యువకుడు సెల్‌తో ఫొటోలు తీసి కారు నంబర్‌ను పోలీసులకు అందజేశారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.